**కోరిన కోరికలన్నీ సఫలం కాకపోయినా జీవితం అంతం కాదు. ప్రాణం ఉన్నంతవరకు మానుషధర్మం నిర్వర్తించవలసిన విధి ఉంటుంది. సాధ్యమైనంత మట్టుకు జీవితాన్ని సార్థకం చేసుకోవాలనే తపన ఉంటుంది. కనకనే ఎడారిలో కాసిన వెన్నెలవంటి భగ్నప్రేమికుల జీవితాలు కేవలం కథలలో మాత్రమే దర్శనమిస్తాయి.**

---

**లెక్చరర్** ప్రసాద్ బోర్డుమీద 'పెరాబోలా' గీసి దానిపై ఏవో లెక్కలు చెబుతున్నారు.

క్లాస్ నిశ్శబ్దంగా వింటూంది.

వాసంతి క్లాస్‌లో ఉన్న అమ్మాయే. కాకపోతే ఆమె మనసు మాస్టారు చెబుతున్న లెక్కలమీద లేదు. అది ఊహాలోకాల్లో విహరిస్తూంది.

ఆమె ఊహలు మాస్టారు ఆధారంగా అందమైన 'పెరాబోలా' చిత్రించుకొంటూంది. రంగు రంగుల హరివిల్లులా మలుచుకొంటూంది.

ఉన్నట్లుండి క్లాస్ ఫక్కుమంది.

ఊహాలోకంలోనుండి ఉలిక్కిపడి ఊడిపడి, మిగతా వాళ్ళు నవ్వుతున్న కారణం తెలియక, బిత్తరపోయింది వాసంతి. వాళ్లతో తనూ గొంతు కలపబోయి, ఆ నవ్వుకు కారణం తనేమోనన్న అనుమానం రావటంతో ఆగిపోయింది.

"నిన్నే మాస్టారు ప్రశ్నిస్తున్నది!" పక్కనున్న శర్మిళ చెప్పింది.

"అసలు ప్రశ్న ఏమిటి?" లేచి నిలబడిపోయింది వాసంతి బెరుగ్గా.

"క్లాస్‌లో శ్రద్ధగా ఉండాలి" అంటూ మాస్టారు తిరిగి ప్రశ్న అడగటంతో నెమ్మదిగా సమాధానం చెప్పింది ఎలాగో. అమ్మయ్య! గండం గడిచింది.

"మరీ అంత పరధ్యానమేం నీకు!" క్లాసు అయిపోయాక శర్మిళ అడిగింది.

'పరధ్యానం కాదు. పరధ్యానమే' అనుకుంది వాసంతి.

"ఏదో ఆలోచిస్తున్నా. ప్రశ్న వేస్తారని కలగన్నానా ఏమిటి?" పైకి అంది.

"కలలు కనేది మాస్టార్ని గురించి అనైనా ఒప్పుకుంటావా?" శర్మిళ నవ్వేసింది.

"ఛ! నీకేం పనిలేదు." వాసంతి గబగబా వెళ్లిపోయింది.

మన మనసులోమాటే ఎవరైనా పైకి చెప్పేస్తే ఒకసట్టాన ఒప్పుకోలేం ఎందుకనో!

శర్మిళ అన్నది తన మనసులో మాటేనని వాసంతి పదే పదే అనుకుంది, తన గదిలో కూర్చుని ఆ సాయంకాలపువేళ.

హృదయంలో ప్రియమైనవి, అప్రియమైనవి సంఘటనలు ఎన్నో కదులుతున్నాయి. చల్లగా వెన్నెల చిలకరిస్తూ మనఃపథంలో ఆయన మూర్తి ప్రత్యక్షమైంది. హృదయానికి బాధ కలిగిస్తూ అతని ప్రవర్తన వెంటనే స్మృతిపథంలో మెదిలింది.

ప్రసాద్, తన మాస్టారు!

'మాస్టారూ! మీకోసం నా నిరీక్షణ ఎన్నాళ్లు! ఎన్ని యుగాలు!! మీ తలపుమాత్రానికే పులకితమైపోతున్న ఈ మనస్సు మీదని గ్రహించలేరా! గ్రహించి ఉపేక్షిస్తున్నారా?'

టేబిల్‌పై తల వాల్చింది వాసంతి. ఆమె కన్నులలో నీటి బిందువులు నిలిచాయి.

'తన ఆరాధనకు ప్రతిఫలంగా తనకు దొరికింది ఒక అపురూపమైన చిరునవ్వేనా! తన కోసం పూచిన మధుర మందహాసమే అది. తనను చూడగానే ఆ పెదవులు విచ్చుకుంటాయి. ఆ క్షణం తన బ్రతుకు ధన్యమయ్యిందనిపిస్తుంది.' వాసంతి కళ్ళు మూసుకుని ఆలోచిస్తూంది.

క్లాసులో బోర్డుమీద మాస్టారు లెక్కలు చేస్తున్నప్పుడు తాను లెక్కలు చెయ్యటం మాని... అటే చూస్తూ కూర్చుంటుంది. సర్వం మరిచి నాగస్వరానికి పడగవిప్పి తన్మయత్వంతో నృత్యం చేసే నాగుబాములా మనస్సు మైమరచిపోతూ ఉంటుంది. వ్రాయటం పూర్తి అయి క్లాసువేపు తిరిగిన అతని చూపులు అటే చూస్తున్న తన చూపులతో ఢీ కొట్టుకోవటంతో తాను సిగ్గుపడి గబగబా పెన్ పుచ్చుకునేది. అపుడాయన పెదవుల్లో ఏదో కొంటెతనం, కళ్లలో దొంగ దొరికిందన్న భావము తోచి నిలువెల్లా సిగ్గుపడిపోయి క్లాసు అయ్యేదాకా వంచిన తల ఎత్తేదికాదు.

ఆయన కావాలని తన ఆరాధనకు దూరంగా వెళ్లిపోతున్నట్లు కొన్ని కొన్ని సమయాల్లో స్ఫురించి నిలువెల్లా నీరయిపోతుంది తను. ఎందుకాయన అంత గంభీరంగా ఉంటారు? చలాకీగా, చైతన్యవంతంగా ఉండరెందుకని? కన్నులలో ఒక్కొక్కప్పుడు ఆ దైన్యమెందుకు? విలువైన ఆ నిర్లిప్తత ఎందుకు? ఎందుకాయన సరదాగా ఉండరు?

ఆయన నిర్లిప్తత, గాంభీర్యము స్వతహాగా వచ్చినవి కావనీ, తెచ్చిపెట్టుకున్నవనీ తాము ఎక్స్‌కర్షన్‌కు వెళ్లినప్పుడు తెలిసింది. అందరితోను కలిసి చలాకీగా తిరుగుతూ, అన్ని బాధ్యతలూ వహించి నిర్వహిస్తూ, అందర్నీ నవ్విస్తూ, తాము నవ్వుతూ ఎంత ఆనందించారో! అప్పుడే అందరూ తన్ను పాడమని బలవంతం చేస్తే ఆయన కూడా, "పాడండి, వాసంతీ!" అన్నారు. బెరుకు బెరుకుగా తాను గొంతెత్తి వాసంతశోభను వర్ణిస్తూ పాట పాడితే ఆయన, "వాసంతి వసంతశోభ వర్ణించటం ఎంత సహజంగా ఉంది!" అన్నారు. అది విని తాను సిగ్గుపడి పోయింది.

ఆనాడే ఆయనతో ఒకటి రెండు నిమిషాలు ఏకాంతం లభించింది, అదృష్టవశాత్తు. ఏదో తీసుకోవాలని ఆ గదిలోకి వెళ్లింది. పక్కనున్న నదిలో ఈతలాడుతూ, బోటు షికారు చేస్తూ ఉన్నారు చాలామంది. కొంతమంది వెనకే ఉండిపోయారు.

అకస్మాత్తుగా ఆయన్ను ఆగదిలో చూచి నివ్వెరపడింది. కిటికీ దగ్గరగా పడక కుర్చీలో వాలి బయటికి చూస్తున్నారాయన. అలికిడికి వెనుదిరిగి చూచి మధురంగా నవ్వారు.

"ఏం కావాలి, వాసంతీ?" మందహాసంతో అడిగారు.

"బాగ్ తీసుకుందామని..." అంటూ సనిగిముందుకు వచ్చి బాగ్ అందుకోబోయింది తను.

"ఇదిగో" అంటూ ఆయన అది అందుకోవాలని ముందుకు వంగటంతో ఇద్దరి చేతులూ ఒక్కసారే బాగ్‌మీద పడ్డాయి. తన నరనరాల్లో విద్యుత్తు ప్రవహించింది.

ఆ అనుభూతి అంతరంగాన్ని తాకింది.

అదేమో ఏమేమో మాట్లాడదామనుకున్న మాటల్లో ఒక్కటి ఆయన ముందు పైకి రాదు.

"సారీ!" అంటూ ఆయన చెయ్యి తీసివేస్తూ తన కళ్ళలోకి చూశారు. ఆ కళ్లు నిండుగా, మత్తుగా ప్రేమావేశంతో చలిస్తున్నాయి. మాటల్లో వ్యక్తపరచలేని భావం అతని కన్నుల్లో దొరికిపోయింది.

బయట ఏవో మాటలు వినిపించాయి.

"వెళ్ళు, వాసంతీ! ఎవరైనా ఏమైనా అనుకోగలరు." ఆయన పేపరందుకున్నారు.

ఆ కంఠంలో కొత్తగా వినిపించిన ఆప్యాయతాను రాగాలకు కదిలిపోయింది తాను. ఏదో మధురిమ హృదయంనిండా వ్యాపించింది. బాగ్ తీసుకుని గుమ్మం దాటింది.

అప్పటినుండి తన అభిమానము, ఆరాధన లెక్కల్లో జి. పి. లాగా పెరుగుతూంది. మనస్సు ఆరాటం తప్పుతూంది.

కాని, మాస్టారు?

'ఏమీ ఎరగనట్లు ఒకగాంభీర్యమూర్తిలా వెళ్లిపోతారేం? ఏదైనా అర్థం కాకపోతే, లెక్క రాకపోతే చెబుతారు. అంతేనా?

'అంతేనా! గురుశిష్య సంబంధం తప్ప తమ మధ్య మరే అనుబంధం లేదా?' మనస్సు ఆక్రోశించింది.

ఏమీ చెయ్యలేక, మరెవ్వరితో చెప్పుకోలేక డైరీలో వ్రాసుకుంది తన ఆవేదనంతా.

'ఏం చెయ్యను? నా కలలు కల్లలౌతే నేను జీవించగలనా! ఆయన నన్నర్థం చేసుకోరేం? నాన్న అడుగుతారు అప్పుడప్పుడు వివాహ ప్రయత్నాలు చేస్తానంటూ. నేను వారిస్తాను. మనసులో మాట చెప్పేద్దామంటే, ముందు ఆయన్ను అడగవద్దూ? అందుకు అవకాశం ఆయన ఇస్తేనా? తామెక్కడున్నారో అక్కడనుండి ఒక్క అడుగు ముందుకు జరగరే? ఏం, నేను నచ్చలేదా? ఏమో! అయితే నేను కనపడగానే ఆ నవ్వు ఎందుకు పెదవులపై? ఆ చిరుకొంటెతనం ఎందుకు కన్నుల్లో! ఏమిటో! పరవశత్వంలో కొనుకుడనం కఠినంగా ఉంది. నా మమతలో ఈ కలత కాటు వేస్తున్నది. ఏం చెయ్యను? భగవాన్! ఏం చెయ్యను?'

వాసంతి తన ఆలోచనల్లో పడి చీకటి పడటం కూడా గమనించలేదు.

"అదేం, తల్లీ, చీకట్లో కూర్చున్నావు?" తండ్రి వచ్చి లైటు వెయ్యటంతో ఆమె లేచి కూర్చుంది.

"ఏం, వసూ, ఒంట్లో బాగా లేదా? అలా ఉన్నావేం?" ఆయన గాభరాగా అడిగారు.

'మనసులోనే బాగాలేదు' అని మనసులోనే అనుకుంటూ, "నాకేం, నాన్నా, బాగుంటేను!" అంది

---

**కాపా లక్ష్మి**

---



# ముక్కలసీమే
# మిగిలింది

వాసంతి.

"ఎల్లుండి నీ పుట్టినరోజు కదమ్మా! ఎవరెవర్ని పిలుస్తావు?" తండ్రి ఉత్సాహంగా అడిగారు.

వాసంతి బుర్రలో ఒక ఆలోచన మెరిసింది.

"వద్దులే, నాన్నా! ఈసారి ఎవర్ని పిలవను. పరీక్షలు కదూ? అంతా చదువుకుంటున్నారు. పోనీ, మా మాస్టార్ని మాత్రం పిలవనా?"

"నీ ఇష్టం,తల్లీ." ఆయన కూతురి మనస్సు లీలగా గ్రహించారు.

మర్నాడు సాయంకాలం కాలేజీ అయ్యాక మాస్టారి కోసం ఆగింది. ఒక్కొక్కరే అంతా వెళ్లిపోతున్నారు.

వెనకబడిన తన్ను చూస్తూ వస్తున్న మాస్టారి చేరువగా వెళ్లి ఆహ్వానం అందజేసింది. ఏ ధోరణిలో ఉన్నారో మాస్టారు అంగీకరించారు మరునాడు ఇంటికి రావటానికి. వాసంతికి ఆకాశం అందుకున్నట్లయింది.

మరునాడు సాయంత్రం తలంటుకున్న జుట్టులో

# చుక్కలసీమే మిగిలింది

ఎర్ర గులాబీమాల పెట్టుకుంది. పట్టుచీర కట్టుకుంది. చక్కగా ముస్తాబయింది. ప్రతి అణువులోను ఏదో నవోత్సాహం, ఏదో స్పందన, మరేదో నిరీక్షణ.

ఆమె నిరీక్షణ ఫలించింది. వేసిన తలుపు వేనకు అడుగుల చప్పుడు వినిపించింది. ఆమె గుండెలు అతివేగంగా కొట్టుకొన్నాయి.

"రండి, రండి." ఆనందంగా ప్రియుణ్ణి ఆహ్వానిస్తూ ఆమె మెరుపుతీగెలా మెరిసిపోయింది.

"మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే!" అభినందిస్తూ ఆయన చేతిలో ఉన్న పుస్తకం ఆమెకు అందించాడు.

"మీరు రావటమే పెద్ద కానుక నాకు, మాస్టారూ! ఇవి ఎందుకండీ!" అంటూ ఆమె పుస్తకం విప్పి చూచింది. టాగూర్ 'గీతాంజలి'. ముచ్చట గొలిపే దస్తూరితో "వాసంతికి—ఉజ్జ్వల భవిష్యత్తు నాశిస్తూ. ప్రసాద్" అని ఉంది అందులో.

కాఫీరంగు పాంటు, తెల్లని టెరిలీన్ షర్టు, నల్లని బూట్లు, చెరిపిగా రేగే జుట్టు, ఆలోచిస్తున్నట్లున్న తీరు, నవ్వబోతూ ఆగినట్లున్న పెదవులు. 'పొడుగ్గా కొంచెం చామనచాయగా చూడగానే చూపరులను ఆకర్షిస్తూ ఎంత బాగున్నారు మాస్టారు!' ఆమె హృదయం ఉప్పొంగిపోయింది.

"నన్నిలాగే కూర్చో బెట్టేస్తావా, వాసంతీ, ఇవాళంతా?" ఆయన కొంటెగా అనటంతో ఉలిక్కిపడింది వాసంతి. నవ్వేసింది ఆనందంగా.

"మీరూ కూర్చోండి. అన్నట్లు అతిథులు చాలామంది ఉంటారనుకున్నానే! నేను ఏకైక అతిథినా ఏమిటి!" ఆయన నవ్వారు.

ఆమె నవ్వింది. "ప్రస్తుతం అతిథి మీరొక్కరే. మరేం భయపడనక్కరలేదు లెండి!" ఆమె నవ్వుకుంటూ






మీరు పెట్టగల ధరలకు అత్యుత్తమమైన వస్త్రాలు—అవే ట్విన్ టస్కర్: గట్టివి, ఎక్కువకాలం మన్నిక. కొత్తదనం పోకుండా అలాగే వుండగలవు. ఎన్ని ఉతుకులు పడినా మృదుత్వం సడలదు.

మధురై మిల్స్ కంపెనీ లిమిటెడ్, మధురై.
మేనేజింగ్ ఏజెంట్లు ఏ. & యఫ్. హార్వే లిమిటెడ్
మధురకు చేరిన హార్వేస్

హార్వే
ట్విన్ టస్కర్
పాప్లిన్ — డ్రిల్ — కంబ్రిక్

BENSONS-3-MMC-3(I)TEL



ఫలాపేక్ష

ఫోటో—ఎస్. పాల్ (న్యూఢిల్లీ)

లోపలకు వెళ్లి కాఫీ ఫలహారాలు పట్టించుకు వచ్చింది.

"ఇవ్వన్నీ తినడానికే!" ప్రసాద్ ఆశ్చర్యం అభినయించాడు.

ఆమె ముసి ముసి నవ్వులు నవ్వుతూ, "ముఖ్యమైన అతిథి అపాత్రం తినలేరూ!" అంటూ ఓరకంట ఆయన్ను చూచింది. ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.

"వాసంతీ!" ఆతడు మధురంగా పిలిచాడు.

వాసంతి కోటి కోర్కెలతో ఆతనివైపు చూచింది. ఏవో మధుర వాక్యాలు మనస్సు విప్పి చెబుతాడనీ, మనస్తాపం తీరుస్తాడనీ ఆశించింది.

ఆతడు తల కొంచెం ముందుకు వంచి, "మీరు నిలబడే ఉన్నారేం? పరవాలేదు. ఇక్కడా నేను లెక్చరర్‌ని కాదుగా. కూర్చోండి" అన్నాడు.

అంతేనా ఆయన మాట్లాడవలసింది! ఒక్కక్షణం ఆమె హృదయం నిరాశతో మూలిగింది. ఏదో ఆశించిన ఆమె భావం మూగబోయింది.

చేతిలో కొంగు మెలిపెడుతూ కూర్చుంది. ఇద్దరి మధ్యా నిశ్శబ్దం రాజ్యం చేసింది.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ, "ఫలహారం తీసుకోరూ?" అంది ఆమె మృదువుగా.

ఆయన ఫలహారం చేస్తూ "నాన్నగారు ఇంట్లో లేరా?" అని అడిగాడు.

"పని ఉండి బయటికి వెళ్లారు. రావచ్చు త్వరలో." ఆమె బదులు చెప్పింది.

"అమ్మ?" ఆయన ప్రశ్నార్థకంగా చూచారు.

"అమ్మ నాకు బాల్యంలోనే కరువయింది, మాస్టారూ!"

ఆయన నొచ్చుకున్నారు. ఆ కళ్లలో జాలి తొంగి చూచింది.

ఆయనకు తనమీద జాలేనా కలిగింది! అంతకంటే మరో భావం లేదా? ఎలాగైనా మాస్టార్ని కదపాలనిపించింది వాసంతికి.

కాని కళ్ళలో ఆరాధన కదలాడుతూ ఉంటే కనుక్కోలేని ఆ వ్యక్తిని ఎలా కదిలించటం? ఎలా మనస్సు వేధించటం?

"మాస్టారూ! మీ శ్రీమతినొకసారి చూపించరూ!" గోముగా అడిగింది వాసంతి. ఆమెకు తెలుసు ఆయన ఒంటరి వాడని.

"నా శ్రీమతా?" ఆయన ఒక్కక్షణం నివ్వెరపోయారు.

"క్షమించండి. మీకు వివాహం కాలేదనుకుంటా. పొరపాటుగా అడిగానేమో కదూ?" ఆమె కలకల నవ్వింది.

ఆయన ఆశ్చర్యంలోంచి తేరుకుని వాసంతి వైపు నిశితంగా చూచారు. క్లాసులో ఆ ఎత్తిన తల అయినా ఎత్తక మౌనముద్రాంకితురాలుగా ఉండే వాసంతి ఇంత చొరవగా అడగటం ఆయనకు ఆశ్చర్యమే కలిగించింది.

ఆయన నవ్వారు. వాసంతి చాటుగా నవ్వుకుంది.

క్షణం నిశ్శబ్దం.

"పరీక్షలు వస్తున్నాయి. బాగా చదువుతున్నావా, వాసంతీ?"

ఎప్పుడూ చదువు! పరీక్షలు! అంతకుమించి ఈ మధురమయిన ఏకాంతంలో మాట్లాడుకునే విషయాలే కరువయ్యాయా!

వాసంతి సమాధానంగా ఏదో గొణిగింది.

అందమైన, అరుదైన, విలువైన క్షణాలు జరిగిపోతున్నాయి.

"మరిక నేను వెళ్ళిరానా, వాసంతీ!"

"అప్పుడేనా? అహఁ! కూర్చోండి. ప్లీజ్." ఆమె గబగబా అనేసింది. ముందుకు ఒక్క అడుగువేసి, "నాన్న వస్తారు. కాస్సేపు కూర్చోండి."

"మీరేం మాట్లాడటం లేదు. పోనీ....ఒక పాట పాడండి." ఆయన నవ్వుతూ అడిగారు.

ఇదొక అభియోగమా! తాను మాట్లాడటం లేదా? బాగుంది.

ఆయన పాట పాడమని అడగ్గానే ఒక మధురభావ వీచిక ఆమె హృదయంలో సుడులు తిరిగింది.

"నా పాటలేమిటి, మాస్టారూ! పిచ్చి పాటలు." ఆమె అంది.

"అని ఎవరన్నారుట!" మాస్టారు కొంటెగా అన్నారు.

పాడక తప్పలేదు. ఆమె గొంతు సవరించుకుంది. 'సావిరహే తవదీనా' అష్టపది మొదలుపెట్టింది. భావ లహరిలోనుండి శబ్ద తరంగాలు మధురంగా తేలి వస్తున్నాయి. అది జయదేవుని పాట కాదు. ఆమె హృదయ గీతిక. ఆమె భావనాశారిక.

గాయని, శ్రోత ఆ ఇరువురి హృదయాల్లోను కేవలం విరహిణి రాధ మాత్రమే భాసించింది. కృష్ణుని కోసం అలమటిస్తూ, ఆతని కోసం వేచి, కాచి దీనయై ఉన్న రాధ వారిరువురి హృదయాల్ని ఆక్రమించింది. ఆ రాధలో తన్ను నిలుపుకొని, చూచుకొని, భావప్రవంతిలో తేలి ఆడుతూ భావావేగానికి ఆగలేక, కన్నీళ్లు పెట్టుకుంది వాసంతి.

ప్రణయ గీతికా వినడంలో పరవశించిపోతున్న ఆమె చుబుకాన్ని పట్టి, ప్రసాద్ ఒక్కక్షణం తన్ను తాను మరచి, ఆ కళ్లలో ఏదో వెదుక్కోబోయాడు. తానేం చేస్తున్నదో తెలియకుండానే పరవశత్వంతో వాసంతి ప్రసాద్ గుండెలపై వాలింది. ఇరువురూ ఒక్కక్షణం లోకాన్నే మరచిపోయారు.

ఆ సమయప్రభావం అటువంటిది. ఆ ఆకర్షణ అంత బలమైనది. కేవలం రెండు హృదయాలు మాత్రం గుసగుసలు పోయాయి.

తెలివి వచ్చి ఆతడు తెల్లబోయాడు. ఆమె పట్టు సున్నితంగా విడిపించుకొని లేచి నిలబడ్డాడు గాభరాగా. "క్షమించు, వాసంతీ!" అని గొణుక్కుంటూ గబగబా వెళ్లిపోయాడాతడు.

ఆమె ఆ అవస్థనుండి తేరుకోవటానికి పావుగంట పట్టింది. ఆతని ప్రవర్తన అనూహ్యంగా, అభేద్యంగా ఉంది.

నాన్న వచ్చారు. "అదేమిటే? వెళ్లిపోతున్నది మాస్టారే కదూ!" అన్నారాయన ఆశ్చర్యంగా.

"అవును, నాన్నా! మీకోసం చూచిచూచి వెళ్లిపోయారు. అతిథి వస్తే ఇంత ఆలస్యమా, నాన్నా, చేసేది?" ఆమె గారాబాలు పోయింది. ఆయన నొచ్చుకున్నారు.

ప్రసాద్ మాస్టారికి తనపై ప్రేమ ఉన్నదనటానికి ఆ సంఘటనే సాక్ష్యం. అయితే తనకు దూరంగా తొలగిపోవటం ఎందుకు? ఏమిటి కారణం! ఆమెకు కొరకరాని సమస్యే అయిపోయిందీ విషయం.

తన మంచంమీద వాలి ఆమె ఒక్కక్షణం నవ్వుకుంది. మరోక్షణం ఏడ్చింది. మరో క్షణం ఆలోచించింది. రంగురంగుల ఇంద్రధనుస్సు అయింది ఆనాడు వాసంతి.

తండ్రి ఆమెను ఆశ్చర్యంగా చూచి, "ఏం తల్లీ, అలా ఉన్నావు?" అంటే ఏమీ జవాబు చెప్పలేకపోయింది.

రోజులు దొర్లిపోతున్నాయి. ప్రసాద్ కనిపిస్తున్నారు. తమ ఇద్దరి మధ్యా ఏమీ జరగనట్లు ప్రవర్తించబోయేవారు. కాని ఎక్కడో చూపుల్లో దొరికిపోయేవారు. వాసంతి చురుకైన చూపులు ఆయనను వెంటాడేవి.

పెనుభూతాలలాగ వచ్చిన పరీక్షలు అతి ప్రశాం

ంగా వెళ్లిపోయాయి.

ఫైనల్ వాళ్లకు ఇంకా పరీక్షలు జరుగుతున్నాయి. మాస్టారు ఇంకా వెళ్లిపోలేదు.

ఒక్కసారి మాస్టారు మాట్లాడితే ఎంత బాగుంటుంది!

ఆమెకేమీ తోచటంలేదు. కథలు చదువుతూ కూర్చుంటుంది. ఆ కథలు నచ్చవు. విసుగు పుడుతుంది.

ఒకరోజు సినిమాకు పోయింది స్నేహితురాళ్లతో.

ఆ కథలో నాయిక, నాయకుడు గాఢంగా ప్రేమించుకుంటారు. ప్రాణానికి ప్రాణంగా ఉంటారు. పరిస్థితుల ప్రాబల్యం కొద్దీ వారిరువురు విడిపోవలసి వస్తుంది. నాయకుడు నాయిక, అక్కను పెళ్లి చేసుకుంటాడు. నాయిక మరొకరి జీవితంలో ప్రవేశించి ఆతడిని పెళ్లి చేసుకుంటుంది. నాయకుడు చివరకు అన్నీ పోగొట్టుకొని జీవితంలో ఓడిపోయి వెళ్లిపోతాడు దూరతీరాలకి.

ఆమెకు గుండెలు పిండినట్లయింది. ఆ సినిమా చూచి, కన్నీళ్లు ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చింది. కళ్లు ఉబ్బి పోయాయి.

"అది సినిమా! ఆ మాట మరిచిపోకు" అంది నిరుపమ.

"ఛ! ఏమిటది, వాసంతీ, చిన్న పిల్లలా!" రాణి ఓదార్చింది.

"పాత్ర చిత్రణ ఎంత సహజంగా ఉందో!" సరళ మెచ్చుకుంది.

"నాకు హీరోపాత్ర నచ్చింది. హీరోయిన్ స్వార్థపరురాలు. ఒకళ్లని ప్రేమించి, మరో జీవితంలో అడుగు పెట్టటం మాటలా!" వాసంతి అంది ఆలోచిస్తూ.

"అది సహజమే. అలాంటివి ఎన్ని కనటంలేదు." రాణి అంది.

"సహజమేమో కాని నేను సమర్థించలేను. మన సానుభూతి అంతా హీరోకేగాని హీరోయిన్‌కి కాదు. ఆమెకేం? బ్రతుకు నందనవనంగానే ఉంది. ఎటొచ్చీ హీరో మనస్సు నలిగి కుంగి, కృశించి, జీవితంలో ఓడి వెళ్లిపోయాడు" అంది వాసంతి నిట్టూరుస్తూ.

అంతా ఇళ్లకు వెళ్లిపోయారు. వాసంతి మాస్టార్ని గురించి ఆలోచిస్తూ ఎప్పుడో నిద్రపోయింది.

* * * *

మరునాడు వాసంతి మాస్టార్ని చూడాలని గట్టిగా అనుకుంది. ఆ సాయంత్రం ధైర్యంచేసి ఆయన గదికి బయలుదేరింది.

అదృష్టం! ప్రసాద్ గదిలోనే ఉన్నాడు.

"ఎంత అదృష్టం! రండి!" ఆయన తొట్రుపడుతూ ఆహ్వానించాడు కుర్చీ ఇవతలికి జరుపుతూ.

"మాస్టారూ! ఆసమయంలో వచ్చి మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం లేదుకదా!"

"అలా ఎందుకనుకుంటున్నారు? భలేవారే మీరు." ప్రసాద్ నవ్వాడు.

"మాస్టారూ! నన్ను 'మీరు' అని మన్నించటం మానేయండి. మీకు పుణ్యం ఉంటుంది."

"అలాగే." ఆయన నవ్వి, బయటికి వెళ్లబోయాడు.

"అదేమిటి, మీరు వెళ్లిపోతున్నారు! మీరిక్కడ కూర్చుని నాతో మాట్లాడడం కన్న మరింకే అతిథి మర్యాదలు చేసినా నేనెందుకు ఇక్కడికి వచ్చానా అని

# చుక్కలసీమే మిగిలింది

విచారిస్తాను." వాసంతి ఖచ్చితంగా అంది.

ఆతడు ఒక్క క్షణం తటపటాయించి వచ్చి కూర్చున్నాడు.

వాసంతి గది తేరిపార చూసింది. బ్రహ్మచారుల గది ఎలా ఉండచ్చునని ఊహించుకుందో అలాగే ఉంది. కాకపోతే దుమ్మూ, ధూళీగాని సిగరెట్ పీకలు మాత్రం లేవు. మాస్టారికా అలవాటు లేదేమో?

"పరీక్షలయిపోయాయి కదూ! తీరిగ్గా గడుపుతున్నారా సెలవులు?" ప్రసాద్ అడిగాడు నవ్వుతూ.

వాసంతి నవ్వింది అర్థవంతంగా "ఏం తీరికలెండి. అస్తమానం ఆలోచించేవాళ్లకి తీరికేమిటి?" అంది తల కొంచెం వంచి.

"అంత ఆలోచించే విషయా లేమిటో!" ఆతడి నవ్వులో కొంబెదనం తొంగి చూచింది

పట్టుబడ్డట్లు అనిపించింది వాసంతికి. తలఎత్తి సూటిగా చూడలేకపోయింది.

"ఆ ఆలోచనలలో నేనొక అణువును కాదుకదా!" గంభీరంగా ఆతడనేసరికి వాసంతి తలఎత్తి ఆతనివంక సూటిగా చూచింది.

'ఒక్క అణువేకాదు. ప్రతి అణువూ మీరే' అని చెప్పాలనుకున్న ఆమె భావాన్ని ఆమె కళ్లు చెప్పాయి.

ఆతడు చిన్న నిట్టూర్పు విడిచాడు. వాసంతి నిరుత్తరి అయింది.

"నేనంటే మీకిష్టం లేదా, మాస్టారూ!" బాధగా అన్నదామె.

ఆతడు ఒక్కక్షణం ఆలోచించాడు. అభిమానంగా వాసంతి వైపు చూస్తూ "చల్లని పిల్లగాలి, తెల్లని వెన్నెల ఇష్టం లేనివాళ్లుఉంటారంటావా, వాసంతీ!" అన్నాడు. ఆతని కంఠస్వరం బాధతో ధ్వనించింది. లేచి కిటికీ వద్దకు వెళ్లాడు.

వాసంతికి ఆతని ధోరణి అర్థంకాలేదు. ఒక్కక్షణం ఆమె హృదయం పులకరించింది. ఆతనికి తానంటే ఇష్టమే. మరి.....

"మాస్టారూ! మీరన్నది నిజమే అయితే మీరెందుకు నాకు దూరంగా వెళ్లిపోవాలని చూస్తారు? అది నా దురదృష్టమా!" ఆమె కన్నులనిండా నీరు ఉబికింది.

"నీ దురదృష్టం కాదు, వాసంతీ! అదృష్టం వచ్చి అరచేతిలో నిలుస్తాన్నన్నా అందుకొనే స్థితి కాదు నాది."

సర్వరోగాలను హరించి స్వాస్థ్యం చేకూర్చేవాడు దేవుడు; కాని ముడుపు తీసుకొనేవాడు వైద్యుడు.

— ఫ్రాంక్లిన్

* * *

నలభై ఏళ్ళ వయసు వచ్చిన తరవాత ప్రతి ఒక్కడూ వైద్యుడైనా కావాలి; మూర్ఖుడైనా కావాలి.

— నానుడి

ఆతడు నిరాశాతప్త హృదయంతో అన్నాడు.

తలమీద చల్లని చెయ్యిపడింది. ఆ స్పర్శానుభూతికి మండిపోతున్న హృదయంమీద గంధం చిలకరించినట్లయింది. ఆతడు తలతిప్పి వేదనతో ఆమెను చూశాడు.

"మీ బాధ నాకు చెప్పండి. నాతో పంచుకోండి, మాస్టారూ! నేను దగ్గిర అవుతున్నకొద్దీ దూరమవకండి. నేను భరించలేను. నన్ను అర్థం చేసుకోరూ! మిమ్మల్ని నన్నర్థం చేసుకోనివ్వరూ!" ఆమె అతని గుండెలమీద తలవాల్చి దీనంగా అడిగింది.

ఒక్కక్షణం మౌనంగా ఉన్నారిరువురూ.

ప్రసాద్ అన్నాడు. "వాసంతీ! ఒక్క కోరిక కోరతాను. ఏమీ అనుకోవు కదా!"

వాసంతి ఆశ్చర్యంతో 'ఏమిటది?' అన్నట్లు ప్రశ్నార్థకంగా చూచింది.

"ఒక స్నేహితురాలుగా ఒకటి రెండురోజులు మా ఇంటికి రాగలవా?"

ఆతడేమంటున్నాడో అర్థంగాక వాసంతి విస్మయంతో చూడసాగింది. తానడిగింది ఒకటి. ఆయన అడుగుతున్నది మరొకటి.

"నేనేమీ చెప్పలేను. నన్నొక మిత్రుడుగా భావించి రెండు రోజులు మా ఇంట్లో ఉండు, ఇది నీకు ఉచితమనిపిస్తేనే. మా ఇంట్లో అమ్మా, చెల్లాయి వాణీ, నాన్నా, ఇంకా చాలామంది ఉన్నారు." కలలో మాట్లాడినట్లు మాట్లాడుతున్నాడు ప్రసాద్.

వాసంతి సంకోచంతో, "ప్రయత్నిస్తాను. అయినా ఎందుకో ఏమిటో?" అంది.

"వాసంతీ! నీవు ప్రేమించిన నేను ఏ పరిస్థితుల్లో ఉన్నానో నీ కర్థమవుతుంది. అందుకనే."

"మిమ్మల్ని అర్థం చేసుకోవటంకన్న అదృష్టం నాకేమీ లేదు. తప్పక వస్తాను." మాట ఇచ్చేసింది వాసంతి.

ఆతని కళ్లలో ఒక తళుకు తోచి మాయమైపోయింది.

ఇంటికి వచ్చిన వాసంతి బుర్ర బద్దలు కొట్టుకొంది ఆలోచనలతో. 'ప్రసాద్ ఉద్దేశ్యమేమిటి? ఇంట్లో వాళ్లు ఈ పెళ్లికి ఒప్పుకోరనా? చదువుకున్న పిల్లని చేసుకోవటం వాళ్ల పెద్దలకు ఇష్టం లేదా? లేక వేనరిం ఉందేమో? ఆర్థికమైన బాధ లేమైనా ఉన్నాయా? తన్ను పెళ్లి చేసుకుంటే ఆయన వహించవలసిన కష్టతర బాధ్యతలేమైనా ఉన్నాయా! ఆతని ప్రేమకు, పెళ్లికి అడ్డు పడుతున్న ఆ విషయా లెటువంటివి? అవి చూచి తాను భయపడుతుందేమో తెలుసుకోవటానికా ఈ ప్రయత్నం?'

ఊహలతో విసిగి వేసారిపోయింది వాసంతి.

పదేపదే తన్ను వాళ్ల ఇంటికి రమ్మని ఆహ్వానిస్తున్న మిత్రురాలు గీత ఊరికి వెళ్లివస్తానని తండ్రి అనుజ్ఞ తీసుకొని, గుబగుబలాడుతున్న గుండెలతో ఆమె మరునాడు మధ్యాహ్నం ప్రసాద్‌తో రైలెక్కింది. ఏదో కొత్త అనుభవాన్ని ఎదుర్కోబోతున్నట్లు అనుభూతి పొందింది వాసంతి.

* * * *

బాలభానుని బంగారు కిరణం ఒకటి చురుక్కుమంటూ ముఖంమీద పడేసరికి వాసంతి కన్నులు తెరి

చింది. ఎదురుగా గోడమీద ఉన్న ప్రసాద్ చిత్రపటం ఒకటి ఆమెకు కనిపించింది. దానివైపే కన్నులు విలిపి చూచింది వాసంతి.

ఎంతో స్వచ్ఛంగా నవ్వుతూ, పందొమ్మిది, పద్దెనిమిది సంవత్సరాల వయస్సులో తీయించుకున్న ఫోటో అది. అప్పటికీ ఇప్పటికీ ఎంత తేడా! అప్పుడు అమాయికత, ఇప్పుడు విజ్ఞానం. అప్పుడు అవ్యక్త మందహాసం, ఇప్పుడు విలక్షణా గాంభీర్యం. గాలికెరటాలాంటి ఊహలేమో అప్పుడు! అయితే జీవితంలో కొన్ని అనుభవాలు గడించిన స్థిరాభిప్రాయాలా ఇప్పుడు? ఈ మధ్యకాలం ఆయనకేమి నేర్పిందో!

'నే నీతని జీవన సహచరిని కాగలనా? కానప్పుడు నేను బ్రతకగలనా?' ఆ ఆలోచన రాగానే ఆమె గట్టిగా కళ్ళు మూసేసుకుంది. శ్రీవాసుణ్ణి ప్రార్థించింది.

రాత్రి ప్రసాద్ ఆమెను తీసుకుని ఇంటికి వచ్చాడు. ప్రయాణం జరిగినంతసేపు వాసంతిని కంటికి రెప్పలా చూచి, సరదాగా నవ్వించాడు కూడా. కలకలలాడి జగాన్నే మరిచిపోయింది వాసంతి.

పెద్ద ఇల్లు. కలిగిన కుటుంబమని చూడగానే తెలుస్తోంది. బండి చప్పుడు విని ఒక మధ్య వయస్కురాలు బయటికి వచ్చింది. ఒకళ్ళిద్దరు పనివాళ్ళు తొంగి చూచారు.

"అమ్మా, ఈ అమ్మాయి వాసంతి. నా స్టూడెంట్. స్నేహితురాలింటికి వెళుతూంటే మన ఇంటికి ఆహ్వానించాను. రెండురోజులు మన ఇంట్లోనే ఉంటుంది. ఎలా చూస్తావో!" ప్రసాద్ నవ్వాడు.

"నాకు చెప్పాలా, ప్రసాద్." ఆమె నవ్వింది మధురంగా. ఆప్యాయంగా వాసంతి చెయ్యి పట్టుకొని, "రా అమ్మా. ప్రయాణంలో అలిసిపోయావేమో" అంటూ లోపలికి తీసుకుపోయింది.

"వాణీ, ఇలా రావే!"

పిలుపు వినగానే మెరుపుతీగెలా ఒక అమ్మాయి వచ్చింది వాసంతి ఈడే ఉంటుంది ఆమెకు. వాసంతి వైపు ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయిందామె.

"మా అమ్మాయి, వాణి! ఈమె అన్నయ్య స్టూడెంట్, వాసంతి." ఆమె ఒకరికొకర్ని పరిచయం చేసింది. "వాణీ! వాసంతికి స్నానాలగది చూపించు. కొత్త చోటనిపించకుండా చూడాలి. ఏం?"

వాణి నవ్వింది. "రండి" అంటూ తన గదిలోకి తీసుకుపోయింది పాలేరు ఆమె సూట్‌కేస్ తెచ్చి లోపల పెట్టాడు

ఇద్దరూ క్షణంలో ఆప్తమిత్రులైపోయారు.

ఆ ఇంట్లో ఎవరుఉంటారో, ఎంత కొత్తగా, బెరుగ్గా ఉంటుందో అని భయపడిన వాసంతికి వాణిని చూడగానే పరమ సంతోషం అయింది.

"అన్నయ్య అప్పుడప్పుడు నిన్నుగురించి చెబుతాడు" అంది వాణి.

వాసంతి తెల్లబోతూ. "ఏమనీ?" అని అడిగింది.

"చక్కగా చదువుతావనీ, క్లాసులో వరధ్యానంగా దిమ్మతుత్తులు చేస్తావనీ!" కలకలా నవ్వింది వాణి. వాసంతి కూడా గొంతు కలిపింది.

"నీవేం చదువుకున్నావు, వాణీ?" వాసంతి అడిగింది.

"స్కూల్ ఫైనల్ పాసయ్యాను. నాన్నగారికిష్టం లేదు, ఆడపిల్లలు ఎక్కువ చదువుకోవటం. అందుకని మానేశాను. హిందీ పరీక్షలు వ్రాస్తున్నాను. వీణ కూడా నేర్చుకుంటున్నాను.'

"అన్నయ్యకి కూడా ఇష్టంలేదా ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగింద వాసంతి.

"అన్నయ్యకి ఇష్టమే. కాని నాన్న మాటకి ఎదురు చెప్పలేరెవ్వరూ ఇంట్లో." వాణి అంది.

వాణితో అలా మాట్లాడుతూ ఉంటే ఎంతో సేపు అలాగే కూర్చో బుద్ధివేసింది వాసంతికి. వాణిలో ప్రసాద్ పోలికలు ఉన్నాయి.

"రండి, స్నానం చేద్దురుగాని." వాణి ఆమెను వెంటబెట్టుకు వెళ్ళింది.

పెరట్లో పెంపుడు పావురాలను ఎగరగొట్టేస్తోంది ఒకామె ఎవరో. వాణి అడ్డపడి ఆమెను కొన్నాడి లోపలికి పంపించింది. వాసంతి స్నానం చేసి వచ్చింది.

పక్కన కూర్చుని ప్రసాద్ తల్లి సరళమ్మగారు వడ్డిస్తూ ఉంటే, ఎదురుగా వాణి కూర్చుని కబుర్లు చెబుతూ ఉంటే ఆమె హృదయంలో ఏవో కొత్త అనుభూతులు కలిగాయి.

జ్ఞానం వచ్చీ రాకముందే వాసంతికి తల్లిపోయింది. మాతృప్రేమ, వాత్సల్యం ఎలాంటివో ఆమెకంతగా అనుభవం లేదు. తోబుట్టువులు లేకపోవటంవల్ల సోదరి ప్రేమకూడా ఆమె ఎరగదు. ఆమెకు తెలిసిందల్లా అపారమైన పితృప్రేమ మాత్రమే. స్నేహితురాండ్ర అప్యాయానురాగాలు కూడా ఆమె చాలావరకు పొందింది.

సరళమ్మగారు వాసంతి విషయాలన్నీ ఒక్కొక్కటే అడిగారు. నవ్విస్తూ ఆమె బెరుకును, మొహమాటాన్ని పోగొట్టారు.

"ఇంత తక్కువ తింటే ఎలాగమ్మా పడుచుపిల్లలు?" అన్నారామె వాసంతి భోజనం చూచి.

"మా నాన్నగారికి పరిచయం చేస్తాను. రండి!" అంటూ వాణి, వాసంతిని లాక్కుపోయింది.

రామచంద్రరావుగారు గంభీరమైన మనిషి. ఎప్పుడూ ఏవో వ్యాపార విషయాల్లో, పనుల్లో నిమగ్నులై ఉంటారాయన. వాసంతిని చూచి వాళ్ళ నాన్నగారి కబుర్లడిగారాయన.

'ప్రసాద్ మళ్లీ కనిపించలేదేం చెప్మా!' వాసంతి మనస్సులో అనుకుంది.

అన్నయ్య కాలేజీ కబుర్లు ఉత్సాహంగా అడుగుతూ చెప్పించుకుంటూంది వాణి తన గదిలో.

"ఏం, వాణీ! ఇవ్వాళ వాసంతిని నిద్రపోనిచ్చేట్లు లేవే!" నవ్వుతూ వచ్చాడు ప్రసాద్. వాసంతి ముఖం వికసించింది.

"నువ్వు ఉండన్నయ్యా! నేనేదో మీ స్టూడెంట్‌ను విసిగి వేధిస్తున్నట్లు మాట్లాడతావేమిటి?" మూతి బిగించుకుంది వాణి.

ముగ్గురూ నవ్వారు.

"ఏం, వాసంతీ! మా ఇల్లు ఎలా ఉంది? కొత్తగా అనుకుంటున్నావా ఇంకా?" సస్నేహంగా అడిగాడు ప్రసాద్.

"కొత్తగా అనుకోనిస్తే కదూ!" మనసూర్తిగా నవ్వేసింది వాసంతి. ఎన్నో యుగాలనుండి వీరందరూ తనకు ఆత్మీయులే ననిపించిందామెకు. ఆమెకా క్షణం

> వాస్తవానికి మించిన మంచి ఆదర్శం లేదు.
>
> —రిచర్డ్ ఎ. కాబట్
>
> * * *
>
> కార్యరూపం ధరించని మాటలు ఆదర్శ వాదాన్ని హతమార్చేవి.
>
> — హెర్బర్ట్ హూవర్

ప్రసాద్ అర్థం కాలేదు. ఆయన తననిక్కడకు తీసుకు రావటంలోని అంతరార్థం అర్థం కాలేదు.

"అన్నయ్యా! వాసంతికి వీణ వచ్చునుట." వాణి ఉత్సాహంగా చెప్పింది.

"నిజంగానా! ఏదీ! వాసంతీ! ఒక్క పాట వాయించవూ!" అని అభ్యర్థనలో అంతలోనే దైన్యరేఖా? ఇదేమి వింత!

"ఇవ్వాళ కాదండి. రేపు వినిపిస్తాను. ఏమీ అనుకోకండి దయచేసి." అనునయంగా అంది వాసంతి.

ఒక్క క్షణం కూర్చుని ప్రసాద్ వెళ్ళిపోయాడు.

దీర్ఘంగా ఆలోచనలో పడిపోయిన వాసంతికి వాణి నిట్టూర్పు వినపడి ఆశ్చర్యంగా చూచింది.

"భగవంతుడు చాలా నిర్దయుడు." అస్పష్టంగా అంది వాణి.

"ఏమిటి, వాణీ! మాస్టారు....." వాసంతి ఏమో అడగబోతూండగా సరళమ్మగారు వచ్చింది, "వాణీ! మనం పైన గదిలో పడుకుందాం. రండి" అంటూ.

* * *

"మెలుకువ వచ్చినా ఇంకా ఆలోచిస్తున్నారేమిటి?" వాణి అడుగుతూంది దగ్గరగా నిలబడి.

వాసంతి కళ్ళు తెరిచి నవ్వుతూ లేచింది.

"నవ్వుతూ నిద్ర లేచేవాళ్ళంటే మా అన్నయ్యకెంత ఇష్టమో తెలుసా, వాసంతీ!" పక్కున నవ్వింది వాణి.

వాసంతి సిగ్గుగా, "అలాగా! మీ అన్నయ్య కింకా ఏమేమి ఇష్టం?" అని అడిగింది.

"మా అన్నయ్యకు సాహిత్యమంటే పిచ్చి. నిద్రాహారాలు మాని మరీ చదువుతూంటాడు. ఇంకోటి, జాబులు వ్రాయటం. ఎంత చక్కని ఉత్తరాలో వ్రాస్తాడు అన్నయ్య. నాకు వ్రాసినవి చూపిస్తాలెండి మీకు."

"సంగీతం కూడా ఇష్టమేనా?"

"ఇష్టమే కాదండోయ్. మా అన్నయ్య ఫిడేలు వాయిస్తే వినాలి మీరు. ప్చ్...ఇప్పుడు వాయించటం లేదులెండి. అన్నయ్య సరదాలన్నీ పోయాయి." వాణి దీర్ఘంగా నిశ్వసించింది.

"ఎందుకని? ఏమయింది? చెప్పు, వాణీ! మాస్టారికేమయింది? ఎందు కంత నిర్లిప్తంగా ఉంటారు చెప్పు. చెప్పవూ!" ఆమె ఆత్రంగా అడిగింది. తన ఆవేశాన్ని వాణి ఎలా అర్థం చేసుకుంటుందో నన్న ధ్యాస కూడా లే దామెకు.

"అదో కథలెండి. మీరు ముఖం కడుక్కొని, స్నానం లదీ కానివ్వండి. తరవాత చెపుతాను. ఇప్పుడు కబుర్లు చెప్పుకుంటే అమ్మ కోప్పడుతుంది. రండి." వాణి చెమ్మగిల్లిన కళ్లతో వెళ్లిపోయింది.

డోలాయమాన హృదయంతో పెరట్లోకి నడిచింది వాసంతి. అక్కడి దృశ్యం చూసి ఆమె ఒక్క క్షణంపాటు స్తంభించిపోయింది!

రాత్రి పావురాలు ఎగరగొట్టిన ఆవిడ, ఆమే. బావి గోడమీద కూర్చుని లోపలికి కాళ్లు వేసి ఆడిస్తూంది. మధ్య మధ్య పెద్దగా నవ్వుతూంది.

"అయ్యో! వాణీ! వాణీ! .. ఆమె పడిపోతుందేమో బావిలో!" గాభరాగా పిలిచింది వాసంతి.

"అదేమిటే, రాధా, మళ్లీ మొదలెట్టావూ! రా! దిగి రా!" సరళమ్మగారు వచ్చి గద్దించింది.

రాధ బిత్తరపోయి చూసింది.

"చెపుతూంటే నీ క్కాదూ! ఊఁ! దిగు."

ఆమె ఒక్కసారి నవ్వి కిందికి దిగి వచ్చింది, "నీటిలో నా పోసు కనిపిస్తూందిగా!" అంటూ.

"నీతో చా వొచ్చిందే నాకు! పద! లోపలికి పద." ఆమె రాధను లోపలికి పంపి వంట ఇంట్లోకి వెళ్లిపోయింది.

# చుక్కలసీమే మిగిలింది

రాధ!

రాధ చక్కటిది. తెల్లని రంగు. గుండ్రని ముఖం. జుట్టు పెద్దదే అయినా, చిందరవందరగా ఉంది. ముఖం మేఘమాలలో చిక్కుపడిన చందమామలా ఉంది. కొంగు అస్తవ్యస్తంగా కప్పుకుంది. ఆ నడక తీరులో పిచ్చి వాలకం, మరేదో నిర్లక్ష్యం ద్యోతకమౌతున్నాయి.

ఎవ రీ పిచ్చావిడ!

"అదేమిటండీ! ముఖం కడుక్కున్నారేమో అనుకున్నా. కడుక్కోండి. కాఫీ చల్లారిపోతూంది." వాణి వచ్చింది.

కాఫీ, ఫలహారా లయ్యాయి.

వాణి గదిలో మంచం మీద ప్రసాద్ వ్రాసిన నవల ఒకటి తిరగేస్తూ కూర్చుంది వాసంతి. 'తా నిక్కడికి వచ్చేదాకా ప్రసాద్ ఇంత కళాపిపాసి అనీ, సాహిత్య రంగంలో కృషి చేస్తున్నవాడనీ తనకు తెలియనే తెలియదు. తనకు లెక్చరర్‌గా తెలుసు. కమనీయమైన నవ్వుతో తన మదిలో పన్నీరు చిలకరించగల ప్రియుడుగా తెలుసు. అంతే!

'తా నిక్కడికి రావటం ఒకందుకు మంచిదయింది. ప్రసాద్‌లో నిబిడీకృతములై ఉన్న విలువలు తెలుసుకోగలిగింది.'

ఆమెకు ప్రసాద్‌పై ఉన్న ప్రేమాభిమానాలు రెట్టింపయ్యాయి.

'భగవంతుడు నిర్దయుడంది వాణి. ప్రసాద్ కథ చెపుతానన్నది. ఏమిటో అది? ఏమై ఉంటుంది?' ఆలోచనలు పరుగులు పెట్టాయి.

వాణి వచ్చింది. "ఆ నవల చదువుతున్నారా? మూడు సంవత్సరాలక్రితం నవలల పోటీలో అన్నయ్య బహుమతి తెచ్చుకున్న నవల అది."

వాసంతి నవ్వుతూ, "మీ అన్నయ్యకు రాని విద్య ఏదో చెప్పు వింటాను. అన్నిటా చెయ్యి తిరిగినవాడే. అటువంటి అన్నయ్య ఉన్న నీవు అదృష్టవంతురాలివి" అంది.

వాణి గంభీరంగా, "మీ రలాగే అనుకుంటారు. కింద నీళ్లు ఎంతగా గలగల పారుతూ, ఉద్వేగ్నంగా లేనిస్తూ ప్రవహిస్తున్నా నిశ్చలంగా, నిశ్శబ్దంగా నిలిచే వంతెన వంటివా డన్నయ్య. అన్నయ్యను విధి ఎలా వంచించిందో, అంతరంగంలో అన్నయ్య ఎంత ఘోషపడుతున్నాడో మీ కెలా తెలుస్తుంది?" అంటూ టపటపా కన్నీళ్ల


ASP/MICO/41 T

రిపేరి ఖర్చులు
తగ్గవలెనంటె మైకో
ఫిల్టర్ ఇన్‌సర్టలనే
తప్పక ఉపయోగించండి




MICO

LICENCE BOSCH

మోటార్ ఇండస్ట్రీస్ కంపెని లిమిటెడ్ బెంగళూరు

అధికారము పొందిన మా ప్రతినిధులు : దుర్గా డీసిల్ హౌస్, గోపాలరెడ్డి రోడ్డు, విజయవాడ-2. ■ నేషనల్ ఆటో అండ్ హార్డ్ వేర్ స్టోర్సు, కాశేశ్వరరావు రోడ్డు, బకింగ్‌హామ్‌పేట పోస్టు, విజయవాడ ■ పయనీయర్ ఆటోమొబైల్స్, ట్రంకు రోడ్డు, గుంటూరు-1 ■ ప్రిమియర్ ఏజెన్సీస్, "దుర్గాభవన్" 141-రాష్ట్రపతి రోడ్డు, సికిందరాబాద్ ■ శ్రీ రామదాస్ మోటార్ ట్రాన్స్‌పోర్టు ప్రైవేట్ లిమిటెడ్, పోస్టు బాక్సు నెం-42, సుభాస్ రోడ్డు, కాకినాడ ■ శ్రీ రామదాస్ మోటార్ ట్రాన్స్‌పోర్టు ప్రైవేట్ లిమిటెడ్, శివాలయంవీధి, బందర్ రోడ్డు, విజయవాడ-2 ■ శ్రీ రామదాస్ మోటార్ ట్రాన్స్‌పోర్టు ప్రైవేట్ లిమిటెడ్, డాబాగారా రోడ్డు, వాల్తేరు రైల్వేస్టేషన్, విశాఖపట్టణము-4 ■ స్వస్తిక్ డీసిల్ అండ్ ఇంజనీయరింగ్ కార్పొరేషన్, రంగనాయకుల పేట, ట్రంకు రోడ్డు, నెల్లూరు.

కార్చింది.

"అదేమిటి, వాణీ!" వాణి భుజంపై చెయ్యి వేసి అనునయంగా అడిగింది వాసంతి.

"మీ రేమనుకోకండి. అన్నయ్యపై మీ కున్న భావం నా కర్థమయింది. నేను పొరపడలేదనుకుంటాను. కాని, మీ రీ వార్త ఎలా స్వీకరిస్తారో, ఈ నిరాశకు ఎలా తట్టుకుంటారో ఏమో! మా అన్నయ్య పెండ్లి అయింది." వాసంతిని చూడలేక వాణి ముఖం తిప్పుకొంది బాధతో.

నిర్మల నీలాకాశం నుండి ఒక్కసారి పిడుగు పడినట్లయింది. హృదయంలో దేదీప్యమానంగా వెలుగుతూన్న ఆశాజ్యోతిని ఏ క్రూరహస్తమో ఉఫ్‌మని ఆర్పేసింది. ఏదో అభూత కల్పన వింటున్నదానిలా నిశ్చేష్టిత అయి కూర్చుండిపోయింది వాసంతి.

చుట్టూ ఉన్న ప్రపంచం గిర్రున తిరిగిపోయింది.

'ఏమిటి వాణి అన్నది? ఇది కలా? భ్రమా? కాదు. ఇది నిజం కాదు. ఏదో పీడ కల! మరేదో మతిభ్రమణం! అంతే! లేకపోతే మాస్టారు వివాహితుడేమిటి?' ఆమె మనస్సు ఎదురు తిరిగింది.

"నీవు చెప్పింది నిజమా, వాణీ! చెప్పు! చెప్పు, వాణీ!" వాణి భుజాలు పట్టుకొని ఊపేసింది వాసంతి, తానేం చేస్తున్నది తనకే తెలియని స్థితిలో.

వాణి ఆమె వైపు సానుభూతి కుమ్మరిస్తున్నట్లు చూసింది. చల్లగా హిమంలా మారిన ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ, "మీరు ఆవేశపడకండి. మీ కీ వార్త ఎంత అఘాతమో నేను గ్రహించగలను" అంది.

ఏదో ఉన్నత శిఖరాల నుండి అఘాతాల్లోకి తోసివేసినట్లయింది. హృదయంలో రంపపుకోత! ఇంక తన బతుక్కు అర్థమేముంది? భావం లేని గీతం. జీవం లేని భావం. ఇంత శిక్ష ఎందుకు? ఏం పాపం చేసుకుందని?

ఆమె కళ్లనుండి వెచ్చని కన్నీరు స్రవించింది.

'ఈ రహస్యాన్ని తన ముందు వెలిబుచ్చలేక మాస్టారు తనను ఇక్కడికి తీసుకువచ్చారా! నీ దురదృష్ట ప్రేమ గాథా గీతి అక్కడ కాదు, ఇక్కడ మా ఇంట్లో విను, వాసంతీ! అనా ఆయన భావం?' ఇంతవరకూ ఈ ఇంటికి తాను కాబోయే కోడలన్న ఊహలో మురిసిపోయింది! కలలు కన్నది! గుండెల్లో ఆశలు నర్తిస్తుంటే విన్నది. ఒక్క క్షణమే భేదం! తా నీ ఇంటికి పరాయిది శాశ్వతంగా! ఇవాళ వచ్చి రేపు వెళ్లిపోతుంది. ఆ స్థానం, ఆ గౌరవం తన చేతులనుండి జారిపోయింది! ప్రసాద్ తనకు శాశ్వతంగా పరాయివాడు!

ఉబికి వస్తూన్న దుఃఖాన్ని, ఉద్వేగాన్ని అతి ప్రయత్నంమీద నిగ్రహించుకొని తలఎత్తింది వాసంతి. వాణి అనుకంపతో ఆమెనే చూస్తూంది.

"చాలా బాధ పెట్టాను కదూ, మిమ్మల్ని?" వాణి అంది.

"నీవు చెప్పేయటమే మంచిదయింది, వాణీ! కృతజ్ఞురాల్ని. లేకపోతే నా భ్రమలో, నా లోకంలో నే నుండేదాన్నేమో!" వాణి ముందు బయటపడిపోయినందుకు కామె సిగ్గుపడింది. చెదిరిపోయిన భావాల్ని కూడదీసుకుంది.

"మీ వదినగారు ఇక్కడే ఉన్నారేమో కదూ?" వాణి తల ఊపింది.

"ఆమె ఏరి? ఎంతవరకు చదువుకున్నారు? మాస్టారి భార్య అంటే ఎంత అదృష్టవంతురాలో! అలా ఇలా ఉన్నవాళ్లు మాస్టారికి నచ్చుతారా? నా కామెను చూపించు, వాణీ!" మనస్సును చిక్కబట్టుకుంటూ అడిగింది వాసంతి.

"మీ దెంత స్వచ్ఛమైన హృదయం! ఒక విధంగా మీరు ఊహల మనుష్యులు. మనుష్యుల ఊహలు ఉన్నంత సుందరంగా ఊహల మనుష్యులు ఉండరని అంటారు."

ఆ వేదాంతం వాసంతికి అర్థం కాలేదు. "మీ వదిన గారు ఊళ్లో లేరా ఏమిటి?" అని అడిగింది.

"ఊళ్లోనే ఉంది. రండి, చూపిస్తాను." వాణి లేచింది భారంగా.

ఎవరో గట్టిగా ఏడుస్తున్న ధ్వని వచ్చింది లోపలి గదుల్లో నుండి. ఎవరిదో నవ్వూ వినపడింది. గబగబా అటు పరిగెత్తుతున్న వారి అడుగుల సవ్వడి వినిపించింది.

ఇద్దరూ గాభరాగా అటు పరిగెత్తారు.

ఆ గదిలో పూజామందిరం ఉంది. అక్కడ ఏం జరిగిందో వాసంతికి ఒక్క క్షణం అర్థం కాలేదు.

"బాబోయ్! నాయనోయ్! పిల్లాడేమన్నా బతకాలా! ఇయ్యేమి పనులు, బాబోయ్!" పనిమనిషి రంగి పెద్దగా అరుస్తూ ఏడుస్తూన్న పిల్లాణ్ణి దగ్గిరగా లాక్కుంది.

పకపకా నవ్వుతున్న పిచ్చి రాధ ఒక్కసారిగా తెల్లబోయి పిచ్చిగా అందరినీ మార్చి మార్చి చూడసాగింది.

అక్కడ జరిగిం దిది.

దేవుని ముందు దీపం వెలిగించి ఉంది. ఆ రోజు శనివారం. సరళమ్మగారు పూజ ముగించి అప్పుడే బయటికి వెళ్లారు. ఎప్పుడు వచ్చిందో రాధ పనిమనిషి రంగి కొడుకు అయిదేళ్ల రాముతో లోపలికి వచ్చింది. దేవుని ముందు వాణ్ణి నిలబెట్టి, ఇంత హారతి కర్పూరం వాడి కుడిచేతిలో పోసి వెలిగించింది. ఆమె చేస్తున్నదేమిటో ఆ పసివాడి కర్థం కాక అయోమయంగా చూస్తున్న వాడల్లా చేతిలో హారతి కర్పూరం భగ్గున మండేసరికి భయపడి గొల్లుమన్నాడు. కేకలేశాడు. కాని, పిచ్చి రాధ వాణ్ణి వదిలిపెడితేనా!



జీవనోపాధి

ఫోటో—కె. శ్యామసుందర్ (విజయవాడ-2)

తల్లి వచ్చి ఏడుస్తూ పిల్లవాణ్ణి లాక్కుంది. వాడి చెయ్యి బాగా కాలిపోయింది.

"రాధా! ఏం పని ఇది?" అప్పుడే వచ్చి విషయాన్ని గ్రహించిన ప్రసాద్ అరిచాడు, కోపంతో ఎర్రబడ్డ కళ్లతో.

రాధ భయం భయంగా చూసింది. పిచ్చిగా చూసే ఆ పిల్లని కళ్లలో ఏదో భయరేఖ తోచింది వాసంతికి.

రాధ నెమ్మదిగా వెనక్కు వెనక్కు జరుగుతూ పక్క గదిలోకి వెళ్లిపోయింది.

"బావి దగ్గరికి వెళ్తుందేమో చూడవే, వాణీ!" అని హెచ్చరిస్తూ ప్రసాద్ ఆ పిల్లవాణ్ణి దగ్గిరిగా పిలిచి, "రారా! నీకు మందు వేస్తాను. నొప్పి పోతుందిగా. ఏడవకు." అంటూ లోపలికి తీసుకుపోయాడు. బాధగా, ఆవేదనతో ఆయన విడిచిన నిట్టూర్పు వాసంతి విన్నది.

"నన్ను పట్టుకోకు. కరుస్తాను." రాధ గొంతు వినిపించింది.

గదిలోకి వెళ్లబోతూ వాసంతి ఆగింది. తన చెయ్యి పట్టుకొని పెరట్లోకి పోకుండా అడ్డు పడుతున్న వాణిని తిడుతూంది రాధ.

రాధను వదిలి వాసంతివైపు వచ్చింది వాణి దిగులుగా.

"ఎవ రావిడ? పాపం, తానేం చేస్తూందో తనకే తెలియదు. పిచ్చా ఏమిటి? ఎవ రావిడ, వాణీ!" ఆసక్తిగా, సానుభూతిగా అడిగింది వాసంతి.

"మా వదిన. ప్రసాద్ అన్నయ్య భార్య." కన్నీటితో గబగబా గదిలోకి వెళ్లిపోయింది వాణి.

నీలాకాశంనుండి మరో పిడుగు రాలింది. వాసంతి కొయ్యబారిపోయి అలాగే నిలిచిపోయింది.

● ● ●

"ఏం చెప్పను, వాసంతీ! ఎలా చెప్పను అన్నయ్య జీవితంలోని అపశ్రుతిని, మా మీద వాలిన పెనుభూతం లాంటి దురదృష్టాన్ని."

కన్నీళ్లతో అంది వాణి. వాణి కెదురుగా కుర్చీలో మ్లానమైన ముఖంతో, వర్ణించ నలవికాని భావాలతో కూర్చుండి పోయింది వాసంతి.

వేస్వేవారా, ఆయన!

కరుణతో, బాధ్యతా బంధంతో తమను తాము కట్టి వేసుకుని జీవితాన్ని కతివతరం చేసుకున్నారా!

'భగవాన్! ఎందు కింత శిక్ష, ఆ కరుణా స్వభావు నిప్పై!

'భగవాన్! ఎందు కింత శిక్ష ఆ సున్నితమనస్కునికి!'

తన నిరాశను గురించి కాక మాస్టారి జీవితంపై పరుచుకున్న నిరాశను గురించి, ఆయన కెదురైన దుర్విధిని గురించి ఆలోచించింది వాసంతి. మాస్టారిపై సానుభూతి, అనుకంప జనించి ఆమె హృదయమంతా ఆక్రమించుకొనిపోయాయి.

* * *

''మాస్టారూ! నన్ను పంపించరూ, రేపు?''

మామిడి తోటలో గుబురుగా ఉన్న చెట్టుకింద కూర్చుని ఉన్నారు ప్రసాద్, వాసంతులు. వాణి అప్పుడే పాలేర్లు మామిడికాయ దింపుతుంటే వెళ్ళింది.

''ఇంకో రెండు రోజులు ఉండలేవా, వాసంతీ!'' ఆర్ద్రతతో అడిగాడు ప్రసాద్.

''ఉండలేను. క్షమించండి.'' దుఃఖం నిగ్రహించుకొంది వాసంతి.

ఆయన ఒక్క క్షణం మౌనంగా ఊరుకున్నారు.

''వాసంతీ! నీవు నన్నర్థం చేసుకున్నావా! లేక అపార్థానికే తావిచ్చావా!'' ఆయన కంఠం వణికింది.

ఆమె కనుకొలకుల్లో నీటి బిందువు నిలిచింది. ''నన్ను మీరర్థం చేసుకొని ఉంటే ఈ మాట అనరు. మిమ్మల్ని అపార్థం చేసుకోవటమా! అర్థం చేసుకున్నాను కనకనే ఆవేదన...మీవంటి వాళ్ళు ఎక్కడా ఉండరు, మాస్టారూ!'' ఆమె కంఠం నిండుగా ఉంది.

''అవును, వాసంతీ! నాలాంటి నిర్భాగ్యు లెక్కడా ఉండరు.'' ఆయన గొంతు గద్గదమైంది.

ఆపుకోలేని ఆవేశంతో వాసంతి ఉక్కిరిబిక్కిరై పోయింది. ప్రసాద్‌ను దగ్గిరకి చేర్చుకొని ఓదార్చాలనీ, ఆతని తల నిమురుతూ సేద దీర్చాలనీ మనస్సు కొట్టుకుపోయింది. కాని, తన దురదృష్ట ప్రేమ అందని పండయిపోయింది. గగన కుసుమమై పోయింది. తమ ఇద్దరి మధ్య అంతులేని అగాధంతోపాటు అందుకోలేని దూరం ఉంది. తా మొకరి కొకరు ఏమీ కారు. మరి ఎంతో అవుతారు.

'ప్రభూ! ప్రణయంతో జీవితాన్ని నింపి ఈ ప్రళయాన్ని ఎందుకు సృష్టించావు, తండ్రీ!

'మనసులు కలిపి మనువులు దూరంచేసే ఈ వినోదం దేనికి, స్వామీ!

'ఈ బంగారు జీవితాల వడగండ్ల వాన ఎందుకు, ప్రభూ!'

వాసంతి ఆలోచనా ప్రవంతిలో కొట్టుకుపోతూంది.

''వాసంతీ!'' ప్రసాద్ పిలిచాడు.

ఉలిక్కిపడి అటు చూసింది వాసంతి.

''ఒక్క మాట చెపుతాను. వింటావా?''

''ఏమిటి?''

''ఇలాంటి ఆశాభంగాలు జీవితాలలో వస్తూ పోతూ ఉంటాయి. వాటికి అతీతంగా నిలవాలి కదూ?''

''అవును.'' తల ఊపింది వాసంతి.

''మరి, పెళ్ళికి పిలుస్తావు కదూ? ఎక్కడున్నా నిన్ను పెళ్ళికూతురుగా చూచి ఆనందించటానికి వస్తాను.'' నిండుగా పలికాడు ప్రసాద్.

''మాస్టారూ!'' ఒక్క కేక పెట్టింది వాసంతి. ఆమె ముఖ భంగిమ విలక్షణంగా మారింది. జలజలా కన్నీరు ఒలికిపోయింది.

''మాస్టారూ! ఆశాంత వాడిపోయిన మరుక్షణం లోనే పునర్నవానికి ప్రయత్నాలా?''

''అది జీవన లక్షణం కాదూ, వాసంతీ!'' పెదవుల పైకి నవ్వు తెచ్చుకుంటూ ప్రసాద్ అన్నాడు.

''కాదు, కాదు.'' వాసంతి అడ్డు వచ్చింది. ''నా జీవితంలో ఇక ఆ ప్రసక్తి రాదనుకుంటాను, మాస్టారూ! అలా ఊహించకండి నన్ను. తగిలిన ఈ దెబ్బనుండి కోలుకోవటం అంత తేలికంటారా! ఆ విషయం పోనీండి.''

సంధ్య వాలిపోతూంది. చల్లని గాలి వీస్తున్నది. వాణి తిరిగి వచ్చింది.

ముగ్గురూ ఇంటివైపు నడిచారు.

* * *

వాసంతి ఇంటికి తిరిగివచ్చింది.

ఎంత ఉత్సాహంతో, చైతన్యంతో వెళ్ళిందో అంత నిరాశాతప్త హృదయంతో తిరిగివచ్చింది.

అందమైన గులాబీని గుద్దిదుకోవాలన్న ప్రయత్నంలో గుండెకే ముళ్ళు గుచ్చుకున్నాయి. గాయం బాధ పెడుతూంది.

జీవితంలో ఎంతో అనుభవం పొందినదానిలా నిండుగా, గంభీరంగా, నిర్వేదంతో ఇంట్లో అడుగు పెట్టింది.

''ఆదేం, వసూ, ఒంట్లో బాగాలేదా? జ్వరపడ్డావా?'' తండ్రి గాభరా పడిపోయాడు.

''లేదు, నాన్నా! కొంచెం తలనొప్పిగా ఉంది. అంతే.'' ఆమె సోఫాలో వాలింది. కణతలు అదిరిపోతున్నాయి.

''జ్వరం ఉందా? ఏదీ? ఒళ్ళు వేడిగా ఉంది. ఉండు. డాక్టర్ని పిలుస్తాను.'' ఆయన ఫోన్ దగ్గిరకి పరిగెత్తారు.

తండ్రి గాభరా, ఆవేదనా చూస్తూంటే వాసంతి గుండె కొట్టుకుంది. చూస్తూ ఉండిపోయిం దలా.

ఆమె లేత హృదయం ఈ నిరాశకు తట్టుకోలేకపోయింది.

పది రోజులు జ్వరంతో బాధపడ్డింది.

ఆ జ్వరం టైఫాయిడ్‌లోకి దింపింది.

తండ్రి కంటికి రెప్పలా కాచుకున్నాడు. తండ్రి ఒళ్ళో పసిపాపలా నిద్రపోయింది వాసంతి.

నెల రోజులకు వాసంతి ఆరోగ్యంతో లేచి తిరగ గలిగింది. మళ్ళీ మామూలు వాసంతి అయింది.

* * *

దూరంగా నల్లని మబ్బులు తెల్లని మబ్బులతో పయ్యాటలాడుతున్నాయి.

మేఘమాలకు అరుణకిరణాలు జరీ అంచు నేస్తున్నాయి.

వెళ్ళిపోతున్న జగజ్జ్యోతికి వీడ్కోలిస్తూంది పశ్చిమ కాంత, దిగులుతో కాషాయ ఎర్రబడిన కళ్ళతో.

గది ముందు వాలు కుర్చీలో పడుకుని సంధ్యా సౌందర్యం పరికిస్తున్న ప్రసాద్‌కు తలపూ, ప్రకృతికీ

> పట్టుదల విడవని వాణ్ణి విజయలక్ష్మి వరిస్తుంది.
>
> — నెపోలియన్
>
> * * *
>
> నిరాశ చెందవద్దు. ఒకవేళ ఎప్పుడైనా నైరాశ్యానికి గురి అయినా నిరాశతో కూడాపరిశ్రమ కొనసాగించు.
>
> — బర్క్

ఎన్నో సామ్యాలు కనిపించాయి.

ఎన్ని ఆశలు! మరెన్ని అనుభూతులు!

ఎన్ని నిరాశలు! మరెన్ని ఆఘాతాలు!

అసలు జీవితమే ఆశానిరాశల అల్లిక! వెలుగునీడలు!

ఆలోచిస్తూ కూర్చున్న ప్రసాద్‌కు ఎంతకాలం గడిచిందీ తెలియలేదు.

తూర్పు దిక్కున పూర్ణచంద్రబింబం పైకి లేచింది. ఎంత ఆహ్లాదకరంగా ఉంది!

''నాన్నా! నా కా చందమామ నీయవూ!'' స్మృతిపథంలో మూడేళ్ల పుత్రుడు కృష్ణుడు మెదిలాడు. ఆయన హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది.

కొందరిని అదృష్టం వెతుక్కుంటూ వస్తుంది. మరికొందరికి ఎండమావిలా మురిపిస్తూ దూరంగానే వెళ్లిపోతూ ఉంటుంది. ఆ ఎండమావుల వెంట పరుగు అలసి పోయి వారికి మానసిక శాంతే కరవవుతుంది. కోరికలూ, పరిస్థితులూ సమాంతరంగా పరుగుతీసి, మనిషిని కవ్వించి, క్షోభపెట్టి వికటంగా నవ్వుతాయి.

ప్రసాద్ జీవితం అలా అయింది.

అంతరాత్మ ప్రేరేపణతో తానున్న చీకటి కోణంలో ప్రయత్నించి ఒక దీపకళిక వెలిగించుకుందామనే ఆశతో శాయశక్తులా త్రికరణశుద్ధిగా శ్రమించాడు.

బాధ్యతతో రాధను భార్యగా స్వీకరించి ఆమెలో స్త్రీత్వాన్నీ, సున్నితత్వాన్నీ మేలుకొల్పాలని నిరంతరం ప్రయత్నించాడు.

రెండు కొత్త క్యాలెండర్లు వచ్చాయి. రాధలో ఆశించిన మార్పు రాలేదు.

ఎడారిలో జలాశయం కనిపించినట్లు ప్రసాద్‌కు పుత్రోదయం అయింది. వాణి కలకలలాడింది మేనల్లుణ్ణి చూసి. రాధ అమాయికంగా చూసింది. వాణి భర్త రామం ''ఏమోయ్, అల్లుడా!'' అంటూ వేళాకోళం ఆడాడు.

కొడుకు పుట్టిన ఆరో నెలలో రాధ బావిగట్టు మీద కూర్చున్నదల్లా జారి పడిపోయింది. పిచ్చిరాధ పిచ్చిదానిలాగానే ప్రాణాలు వదిలిపెట్టింది.

ప్రసాద్ గుండె రాయి అయిపోయింది. ఆయన కంటి వెంట ఒక్క నీటిచుక్క కూడా రాలలేదు. కృష్ణ, తండ్రి గుండెలకు బల్లిలా అతుక్కుపోయాడు. సరసమ్మగారు వాణ్ణి ఎత్తుకొన్నారు ఏడుస్తూ.

కాలం జరిగిపోతూనే ఉంది. ఏళ్లు గడిచిపోతున్నాయి.

సాయంవేళ తీరిగ్గా కూర్చునప్పుడూ, ఎవరైనా

ఆనందంగా కబుర్లు చెప్పుకుంటున్నప్పుడూ అతని మనస్సులో వాసంతి మెదులుతుంది.

ఎక్కడుందో వాసంతి? ఏం చేస్తుందో?

పోయినసంవత్సరం విశాఖ వెడుతూంటే రైల్లో శర్మిళ కనిపించింది.

"నన్ను గుర్తు పట్టారా, మాస్టారూ!" అని పలకరించింది.

"గుర్తులేకేం! కులాసా?" పలకరించాడు ప్రసాద్. శర్మిళ పక్కన నాలుగేళ్ల పాప. చంకలో అబ్బాయి.

శర్మిళను చూస్తూంటే ప్రసాద్‌కు వాసంతే గుర్తుకు వచ్చింది.

"మీ స్నేహితులంతా బాగున్నారా?" ప్రసాద్ అడిగాడు.

"వాసంతి ఎమ్. ఎ. పరీక్షలు వ్రాసింది. మొన్న కనిపించింది." ప్రసాద్ మనస్సు కనుక్కున్నట్లు చెప్పింది శర్మిళ.

"వాసంతి పెళ్లి చేసుకోలేదూ?" అనుమానంగా అడిగాడు ప్రసాద్.

శర్మిళ దిగులుగా నవ్వుతూ, "చేసుకోనంటున్నదండీ! దాని మనస్సు రాయైపోయింది. చదువు పూర్తి అయ్యాక ఉద్యోగం చేస్తుందట. ఏమిటో వాసంతి నాకు వింతగా కనపడుతూంది, మాస్టారూ!" అంది.

ప్రసాద్ హృదయంలో ఏదో దిగులూ, మరోపక్క ఏదో పులకింతా కలిగాయి.

హృదయమంతా వాసంతితో నిండిపోయింది.

ఆ తరవాత వాసంతి సంగతులు తెలియలేదు.

ఏ బంధమూ లేని ప్రసాద్ హృదయం వాసంతిని అపేక్షించింది. జారిపోయిన వరాన్ని అందుకోవాలని ఆశించింది.

ప్రసాద్ కళ్లు మూసుకొని ఆలోచనలో పరిభ్రమిస్తున్నాడు. చల్లని తెల్లని వెన్నెల ఆయన్ని ఆప్యాయంగా స్పృశించింది.

• • •

స్నేహితుడు రఘు వస్తాడంటూ స్టేషన్‌కు వెళ్ళిన ప్రసాద్‌కు రైలాగి పది నిమిషాలయినా రఘు కనిపించలేదు.

అనుకోనివిధంగా, సెకండ్‌క్లాస్‌లో కంపార్ట్‌మెంట్ తలుపు దగ్గర వాసంతి కనిపించింది.

"హల్లో! వాసంతి! నీవేనా!" సంభ్రమంతో పలకరించాడు ప్రసాద్.

ఒక్కట్లు కొంటున్న [illegible] తలఎత్తి చూచింది. ఆమె ముఖం ఆనందంతో వెలిగింది. "ఎవరు? మాస్టారూ!! ఎంత శుభదినం ఇవ్వాళ!" ఆమె గబగబా కిందికి దిగివచ్చింది "ఎన్నాళ్లకెన్నాళ్లకు" అంటూ.

"బాగున్నావా! ఇప్పుడు నిండుగా ఉన్నావు సుమీ!"

వాసంతి ఒళ్లు జలదరించింది. తలఎత్తి ప్రసాద్‌ను చూచింది. అయిదు సంవత్సరాలకిందట...ఆయన... తన ప్రేమపెన్నిధానం...ఆయన్ని చేపట్టకపోతే తన బ్రతుక్కు అర్థం లేదనుకున్న రోజులు అవి. అవి ఎలా మరిచిపోగలుగుతుంది! ప్రసాద్ ప్రతి కదలిక, ప్రతి మాట తనకు అపూర్వభావాల సమ్మిశ్రంగా తోచేవి. ఆతనితో మాట్లాడటం, వాణి....రాధ...తన పిచ్చి ఆలోచనలు అన్నీ ఆమె మదిలో మెదిలాయి.

# చుక్కలసీమే మిగిలింది

ప్రసాద్ అన్నది నిజమే. అప్పటి తొలిప్రాయపు వాసంతి కాదీమె. కాలం ఆమెలో, ఆమె ఆలోచనలలో మార్పు తెచ్చింది. లేలేతభావాలు స్థిరాభిప్రాయాలుగా మారాయి. సిగ్గు దోబూచులాడే బుగ్గలపై గాంభీర్యం తొణికిసలాడుతూంది. కట్టుకున్న పట్టుచీరలో ఆమె ఎంతో నిండుగా ఉంది.

"వాణి బాగుందా?" వాసంతి అడిగింది.

"ఆ. వాణికి పెళ్లిఅయిందని తెలుసా? ఇద్దరు పిల్లలు." ప్రసాద్ వాసంతివైపు చూశాడు.

వాసంతి పెదిని నొక్కిపట్టింది. ఆమెకు అతణ్ణి కలుసుకోవడం సంతోషంగా ఉంది. కాని ఏం మాట్లాడాలో అర్థం కావటంలేదు.

"ఇవాళకి ఇక్కడ దిగిపోకూడదు? అన్నట్లు ప్రయాణం ఎక్కడికి?"

"గుంటూరు. నేనక్కడ లెక్చరర్‌గా చేరాను. మీకు తెలియదేమో కదూ!"

"ఊహూ. ఇప్పుడు చెప్పావుగా. ఒక్కరోజు మా ఇంట్లో ఉండి మా ఆతిథ్యం స్వీకరించి వెళ్ళకూడదూ!" ప్రసాద్ సస్నేహంగా ఆహ్వానించాడు.

సందిగ్ధంగా నిలిచిపోయింది వాసంతి.

"అర్జంటు పనేమీలేదుగా? రేపు వెడుదువుగాని." ప్రసాద్ చనువుగా అన్నాడు. "పద, నీ సామాను దింపించు. దింపేద్దాం."

మనస్సు వద్దంటున్నా ప్రసాద్ జీవితాన్ని గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి ఆమెను ఒంధించింది.

ఇద్దరూ టాక్సీ వేసుకుని ఇంటికి వచ్చారు.

స్నానం చేసి బొట్టు పెట్టుకుంది వాసంతి. ప్రసాద్ హోటల్ నుండి భోజనం తెప్పించబోతూంటే "వద్దు, మాస్టారూ! ఇవ్వాళ శనివారం. నేను భోజనం చెయ్యను" అంది నవ్వుతూ.

ప్రసాద్ ఆశ్చర్యంగా చూచాడామెను.

"నేను వింతగా కనిపిస్తున్నానా ఏమండీ!" వాసంతి నవ్వుట నిండుగా కప్పుకుంది.

నుసక వెన్నెల్లో ఇద్దరూ కుర్చీలు వేసుకుని కూర్చున్నారు బయట.

వాసంతి మదిలో ఎన్నో ప్రశ్న లడగాలని ఉంది.

"ఎన్నాళ్లయింది, మాస్టారూ, ఇక్కడికి ట్రాన్స్‌ఫరయి?"

"రెండు సంవత్సరాలయింది."

"రాధకి బాగుందాండీ?"

"బాగవలేదు. నా అదృష్టమే బాగవలేదు." ఆకాశంలో వెలుగుతూన్న నక్షత్రాలవంక చూస్తూ నిర్లిప్తంగా అన్నాడు ప్రసాద్.

"ఏమయిందో చెప్పండి." ఆత్రంగా అడిగింది వాసంతి.

"రాధ చనిపోయింది, గుర్తుగా మూడేళ్ల బాబును వదిలిపోయింది." ప్రసాద్ కంఠంలో వేదన ఉంది.

వాసంతి గాభరాగా "రాధ చనిపోయిందా!" అంది. ఆమె హృదయంలో ప్రసాద్‌పై అపరిమితమైన జాలి కలిగింది.

జాలిగా ఆతనివైపే చూచింది.

"బాబు అమ్మ దగ్గిర ఉన్నాడా, మాస్టారూ?" క్షణం ఆగి అడిగింది వాసంతి.

ప్రసాద్ "అవు"నన్నాడు. కొంచెంసేపు మౌనం రాజ్యం చేసింది.

"ఈ మధ్యలో నన్నెప్పుడైనా తలుచుకున్నావా, వాసంతీ?" ప్రసాద్ ఆసక్తిగా అడిగాడు.

వాసంతి కళ్లెత్తింది. "జీవితంలో తారసపడిన ఏ అనుభవమూ మనం మరిచిపోమే! ఇక మిమ్మల్ని ఎలా మరిచిపోగలను?"

"నీవు చాలా మారావు, వాసంతీ!" ప్రసాద్ అనకుండా ఉండలేకపోయాడు.

వాసంతి నవ్వింది. అంతే. ఏమీ అనలేదు.

"నాన్నగారు బాగున్నారా?" ఆమె ముఖంపై చూపు నిలిపి అడిగాడు ప్రసాద్.

వాసంతి కంఠం విషాదంగా మారింది. "నాన్నగారు ఈ లోకం వదిలి సంవత్సరం కావస్తూంది."

"అయ్యో! మీ నాన్నగారు చనిపోయారా!" ప్రసాద్ కంఠస్వరం జాలిగా మారిపోయింది. "నాకు తెలియనే లేదీ సంగతి."

"మీకు వ్రాశాను, మాస్టారూ! కాని మీరక్కడ లేరుగా అందటానికి."

ఆతని మనఃపథంలో ఒకనాడు వాసంతి మామిడితోటలో అన్న మాటలు మెరిశాయి.

"నా జీవితంలో ఇక వివాహ ప్రసక్తి రాదనుకుంటాను, మాస్టారూ! అలా ఊహించకండి నన్ను. ఈ తగిలిన దెబ్బనుండి కోలుకోవటం అంత తేలికంటారా!" అన్నది వాసంతి ఆనాడు.

ఆ వాసంతే ఈమె!


ఆతని నేత్రాలు ప్రేమ, గౌరవాలతో మెరిసిపోయాయి.

వాసంతి ఏమో చెప్పాలని నోరు తెరిచింది. ఆమె

(తరువాయి 61 వ పేజీలో)

హౌరా వంతెన

ఫోటో— కె. వి. రమణరావు (రాజమండ్రి—1)



# చుక్కలసీమే మిగిలింది

(14వ పేజీతరువాయి)

పెదవి దాటి మాటలు బయటికి రాలేదు.

ఆకాశం నిండా చుక్కలు మినుకుమంటున్నాయి, విధురహృదయంలోని ఆశాగీతికల్లాగా.

చల్లనిగాలి సుగంధాల్ని మోసుకు వస్తూంది.

అకస్మాత్తుగా అడిగాడు ప్రసాద్: "వాసంతీ! జీవితం అంటే నీ అభిప్రాయం ఏమిటి?"

వాసంతి కొంచెంసేపు మాట్లాడలేదు. ఆతరవాత అంది: "మన ఆశయాలకు, ఆదర్శాలకు, మనకు ఎదురయ్యే పరిస్థితులకు ఎక్కడా పొత్తు కుదరదు. వెల్లువలో గడ్డి పోచల్లా జీవన ప్రవంతిలో కొట్టుకు పోయేవారే ఎక్కువ, మాస్టారూ! విచిత్రమైన, విభ్రమాల్ని కలిగించే కాలం జీవితాలలో తెచ్చే మార్పులు అనంతం. జీవితం ఒక టాస్క్ మాస్టర్." వాసంతి ఏదో ఉద్వేగంతో చెప్తోంది, కలలో మాట్లాడుతున్నట్లు.

ఆమె భావాలకు, తీవ్రతకు ప్రసాద్ తెల్లబోయి చూచాడు.

"ఈ జీవితం మీకేమి ఇచ్చిందో చెప్పండి. అంతులేని నిరాశ, అగాధమైన దుఃఖాన్నే కదా! దీనికి మీరు బాధ్యులా? మీ మీద నా ఆశలన్నీ నిలుపుకొన్న హృదయం పిడుగుపాటుగా విన్న మీ గాథతో ముక్కలైపోయింది. బతక ననుకున్నాను. బతుకులో రుచి లేదనుకున్నాను. ముడిపడతా యనుకున్న జీవితాలు విధి శాపాన విడివిడిపోయాయి. జీవన మార్గాలు వేరైపోయి, ఎన్నో మార్పులూ కలిగాయి. జీవితం చేసే ఇంద్రజాలమిది. ఒకప్పుడు నేను ఇదిని నమ్మేదాన్ని కాదు. ఇప్పుడు నమ్ముతున్నాను. ఇంకొకటి కూడా నేను నమ్ముతున్నాను, మాస్టారూ! మన జీవితాలు మనకోసం కాదు; మనవాళ్ళ కోసం. మన జీవితం మనకే అయితే దానికి అర్థమే లేదు. అంతేకదండీ! మరొకరి కోసమే కదూ మీ జీవితం ఇలా తారుమారయిందీ; ఇంత దుఃఖాన్ని అనుభవించిందీ?" ప్రశ్నించింది వాసంతి.

ప్రసాద్ ఏదో అదృశ్య శక్తి ప్రేరేపించినట్లు లేచి వచ్చి వాసంతి చెయ్యి అందుకున్నాడు. "వాసంతీ! ఆనాడు మామిడి తోటలో నీవన్న మాటలు మండిపోయే నా గుండెలో ఏదో ఆశను రేకెత్తించేవి. నిన్ను గురించి ఆలోచించని క్షణం లేదు. ఈ జీవితంలో తిరిగి మల్లెలు విరుస్తాయా! మనస్సున మాధురీ భావాలు మొలకెత్తుతాయా, చెప్పు! వాసంతి, చెప్పు."

ఈ హఠాత్పరిణామానికి వాసంతి నిర్ఘాంతపోయింది. ప్రసాద్ అంటున్న దేమిటో ఒక్క క్షణం ఆమెకు అర్థంకాలేదు. అర్థం అయి ఆమెనివ్వెరపోయింది. ఆమె ముఖభంగిమ ఆశ్చర్యానికి ఆశ్చర్యమే అయింది.

ఆమె చేతులు పట్టుకొని ప్రసాద్ అన్నాడు: "ఒకప్పుడు నేను పొందని నీ అవ్యాజమైన ప్రేమ తిరిగి నాకు లభిస్తుందా? చెప్పు, వాసంతీ! నే నందుకు అర్హుడనా?" అతని అభ్యర్థన ఆమెను మేలు కొలిపింది.

అతని పట్టును ఆమె సున్నితంగా విడిపించుకొంది. ప్రసాద్ కౌతుకంతో ఆమెనే చూస్తున్నాడు. ఆమె ప్రవర్తన అతని కర్థం కాలేదు. తాను చేసింది ఉచితమో, అనుచితమో కూడా తెలియలేదు. దెబ్బ తిన్నట్లు చూశాడు.

"వాసంతీ! జవాబు చెప్పవేం!" ప్రసాద్ మనస్సు ఆశానిరాశల మధ్య ఊగిసలాడుతూంది.

కళ్ళ నిండా నీళ్ళతో ఇటు తిరిగింది వాసంతి. "మాస్టారూ! నా మీద మీరు అంత ఆశించుకున్నారా! అయ్యో! మీ ప్రేమకు నే ననర్హురాలిని. నన్ను క్షమించండి." ఆమె నీరసంగా చెప్పింది.

ప్రసాద్ నివ్వెరపోతూ, "ఏమి చెప్తున్నావు, వాసంతీ!" అన్నాడు.

"అవునండీ! నే నిప్పుడు వివాహితురాల్ని. మరొకరికి అంకితమైపోయినదాన్ని." వణుకుతున్న కంఠంతో చెప్పింది వాసంతి.

తాను వింటున్నది నిజమో, అబద్ధమో అర్థంకాని అయోమయ స్థితిలో ప్రసాద్ వాసంతినే చూస్తూ నిలిచిపోయాడు. అతని చుట్టూ ప్రపంచం గిర్రున తిరిగింది.

"నేను మీతో అన్న మాటలు నాకు జ్ఞప్తిలో ఉన్నాయి. నా నిశ్చయం మారటానికి అవకాశం ఉందని నేను గ్రహించలేని స్థితి అది. నా వివాహం చెయ్యాలని, చూడాలని ఆరాటపడిన నాన్నకోసం, మంచం పట్టిన నాన్నకోసం శిలగా మారిన నేను కరిగాను. కలనైనా తలచని మార్పును జీవితంలో ఆహ్వానించాను. మరొకరి జీవితంలో ప్రవేశించాను. అందుకే అన్నాను, మాస్టారూ, జీవితం ఒక టాస్క్ మాస్టరని, మన జీవితాలు మనకోసం కాదనీ..." వాసంతి ఆగి మళ్ళీ అంది: "మాట నిలుపుకోలేని నన్ను మనస్ఫూర్తిగా క్షమించండి, మాస్టారూ!"

ప్రసాద్ కళ్ళు మూసుకొని కుర్చీలో అలాగే రెండు క్షణాలు కూర్చుండిపోయాడు.

"తెలియక అనుచితంగా కోరిన నన్నే క్షమించు, వాసంతీ! మనం గతం మరిచిపోదాం. మిత్రులుగా మిగిలిపోదాం" అన్న మాటలు మాత్రం అనగలిగాడు.

* * *

మనక వెన్నెల మాయమైపోయింది. చీకటి దట్టంగా పరుచుకుంది.

చుక్కలసీమ మనోహరంగా ప్రకాశిస్తోంది.

చుక్కల్లో చుక్కలా అతనికి జీవితంమీద రుచి కల్పిస్తూ చిన్నారి కృష్ణుడు మిగిలాడు.

ఈ సారవిహీనమైన జీవితానికి ఆరని తలపులు, తీరని కోర్కెలు మిగిలిపోయాయి.

అల్లంత దూరాన అందాల చుక్కలసీమే మిగిలింది.

ఏకాకిగా ఆ అంధకారంలో మిణుకు మిణుకుమంటూన్న తారకల కాంతిలో కూర్చున్న ప్రసాద్ హృదయంలో అతని కిష్టమైన కృష్ణశాస్త్రిగారి గేయం ఉండి ఉండి ప్రతిధ్వనించ సాగింది.

"మింట నెచటనో మెరయు చుక్కల
కంట జూచితి కాంక్ష తీరగ,
కాంక్షలూరిన కొలది చుక్కలె
గాంచి బ్రతుకే గడిపితిన్."

★

జగదేక సుందరి క్లియోపాత్ర
రచన: ధనికొండ హనుమంతరావు
త్రివర్ణ ముఖచిత్రం 668 క్రౌను పేజీలు
వెల: రు. 12—00
తెర వెనుక — కిషోర్‌సాహు కథ
త్రివర్ణ ముఖచిత్రం 464 క్రౌను పేజీలు
వెల: రు. 10—00
వివరములకు:
మూర్తి & కో., నంద్యాల—కర్నూలు జిల్లా



ఒత్తుగా పొడుగ్గా నిగనిగలాడే
సుదీర్ఘ కేశసంపదకు
కేశవర్థిని
పెట్టింది పేరు
కొబ్బరినూనెతో కలిపి తలవెంట్రుకలు
లేకుండా వాడడానికి
కేశవర్థిని
రెడిమిక్స్‌డ్ హెయిర్ ఆయిల్
మీ శిరోజాలను పరిమళ
భరితంగా ఉంచడానికి
కేశవర్థిని షాంపూ



కేశవర్థిని ప్రొడక్ట్స్
మాసిలామణి మొదలియార్ రోడ్
మద్రాసు-14